# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 3, జులై 2026






భూ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం

# పకడ్బందీగా చేపట్టాలి

**✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 2, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల తహసిల్దార్ సదానందంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల మిగతా 2లో..

# బాసర ఆలయ చోరీ కేసు ఛేదించిన నిర్మల్ జిల్లా పోలీసులు

**పది రోజుల్లోనే నిందితుల అరెస్ట్.. రూ. విలువైన వెండి కిరీటం, వెండి వస్తువులు స్వాధీనం**

**దిలావర్‌పూర్, జూలై 2, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో ఇటీవల జరిగిన చోరీ కేసును జిల్లా పోలీసులు కేవలం పది రోజుల్లోనే ఛేదించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణుల సహకారంతో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలతో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 1.220 కిలోల వెండి కిరీటం, 260 గ్రాముల వెండి వస్తువులు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులను పల్లపు ఏడుకొండలు, గైని రామకృష్ణ, కొడమ ఆనంద్గా గుర్తించారు. వీరు పాత నేరస్తులని, రైల్వే సౌకర్యం ఉన్న ఆలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడడం వీరి మిగతా 2లో..





# ఎస్ఆర్‌పి-3 గనిలో సైడ్ ఫాల్ ప్రమాదం

✦ ముగ్గురు కార్మికులకు గాయాలు

✦ ఒకరి పరిస్థితి విషమం.. కరీంనగర్ ఆసుపత్రికి తరలింపు

2లో..

– నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త:

# ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై సీపీఐ ధర్నా

**ఆసిఫాబాద్, జులై 2, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యుల విధుల నిర్వహణలో నిరక్ష్యం, నకిలీ హాజరు నమోదు, పర్యవేక్షణ లోపాలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హరితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ విధులకు హాజరు కాకుండానే హాజరు నమోదు చేసిన వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సిబ్బంది విధుల నిర్వహణపై ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణలో లోపాలు ఉండటం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని వారు పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ పరిస్థితి కొనసాగితే వైద్య సేవల నాణ్యత మరింత దిగజారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోయిరే ప్రకాష్, పిడుగు శంకర్, కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, పిప్పిరి వెంకటేష్, శ్రీరామ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఆర్‌పి-3 గనిలో సైడ్ ఫాల్ ప్రమాదం

నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త:

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి-3 భూగర్భ బొగ్గు గనిలో గురువారం ఉదయం జరిగిన సైడ్ ఫాల్ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. గురువారం ఉదయం షిఫ్ట్‌లో గని భూగర్భంలోని 5 సీమ్, 10.5 లెవల్, 15 డీప్ పరిధిలో కోల్ కట్టర్ కార్మికులు సైడ్ స్టిచ్చింగ్ పనులు నిర్వహిస్తున్నారు. గని గోడల నుండి బొగ్గు కూలకుండా రక్షణగా మెస్ వేసి, రోప్ కట్టడానికి డ్రిల్లింగ్ చేస్తూ బోల్టింగ్ పనులు చేపడుతున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా పక్కన ఉన్న పెద్ద షేల్ పెళ్ల కార్మికులపై విరిగిపడింది. ఈ ప్రమాదంలో అక్కడ పని చేస్తున్న కోల్ కట్టర్ కలవేని మహేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, సంపత్ కుమార్, సందీప్ అనే కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరితో పాటు అక్కడే ఉన్న రవీందర్ అనే సపోర్ట్‌మెన్ త్రుటిలో ప్రమాదం నుండి తప్పించుకుని క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే తోటి కార్మికులు, అధికారులు స్పందించి క్షతగాత్రులను గని పైకి తీసుకువచ్చి తొలుత ఆర్‌కే8 డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుండి ప్రాథమిక చికిత్స అనంతరం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో మహేందర్‌కు కాలర్ బోన్ విరగడంతో పాటు శరీరంలో పలుచోట్ల తీవ్ర గాయాలవడంతో, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

### క్షతగాత్రులను పరామర్శించిన ఏఐటీయూసీ నేతలు

ప్రమాద విషయం తెలియగానే గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సెంట్రల్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్యలు ఆర్‌కే-8 డిస్పెన్సరీకి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు యాజమాన్యం తరపున అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందించాలని సింగరేణి అధికారులను డిమాండ్ చేశారు.



# బదిలీ అధికారులకు ఘన వీడ్కోలు.. నూతన అధికారికి ఆత్మీయ స్వాగతం

## ✻ యూనియన్ బ్యాంక్‌లో సన్మాన కార్యక్రమం

కాగజ్‌నగర్ రూరల్, జూలై 2, ప్రభాతవార్త :

విధి నిర్వహణలో విశేష సేవలు అందించిన అధికారులు సంస్థకు మంచి గుర్తింపు తీసుకువస్తారని యూనియన్ బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కోసిని శాఖ యూనియన్ బ్యాంక్‌లో బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సూరజ్‌కు ఘన వీడ్కోలు పలుకుతూ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఫీల్డ్ ఆఫీసర్ సంగీతకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సుమీద్ నిమ్‌సత్‌కర్ మాట్లాడుతూ సూరజ్ తన పదవీకాలంలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి బ్యాంకు అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సంగీత కూడా అదే సేవా స్ఫూర్తితో వినియోగదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సూరజ్‌కు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే నూతన ఫీల్డ్ ఆఫీసర్ సంగీతకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ శైలేంద్ర, అప్పల్ నాయుడు, కోసిని చింతగూడ బ్రాంచ్ క్యాషియర్ ప్రమోద్, క్లర్క్ రాధాకృష్ణ, సిబ్బంది దేవమ్మ, ఐకేపీ సిబ్బంది, బ్యాంక్ మిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం

# పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు.

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలలకు పంపించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్, పైపు లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి సందర్శించారు. ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర ఆలయ చోరీ కేసు ఛేదించిన నిర్మల్ జిల్లా పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకతగా విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన వెండి కిరీటాన్ని విక్రయించేందుకు రైలులో నాందేడ్‌కు వెళ్తుండగా బాసర రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. చోరీ కేసును వేగంగా ఛేదించిన ముధోల్ సీఐ, బాసర ఎస్‌హెచ్‌వో, కానిస్టేబుళ్లు భీమేష్, రపతోళ్ల మోహన్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

# ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యవంతంగా ఎదగాలి

**- విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో మెదలాలి - గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జనకు అడ్డుకట్ట వేయాలి**

**- పోక్సోచట్టం 2012 క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

బజార్‌హత్నూర్, జులై 02, ప్రభాతవార్త:

విద్యార్థుల ఆరోగ్యం, విద్యా భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య పాఠశాల కార్యక్రమం మరింత సమర్థవంతంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన మూడో విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సాంస్కృతిక కళాకారులు పాటలు, నృత్యాలతో ఆరోగ్య పాఠశాల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గత రెండేళ్లుగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమం విజయవంతంగా అమలవుతుందని, దీనికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు అవార్డులు లభించాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల రక్షణ కోసం పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు పోక్సో క్యాలెండర్‌ను రూపొందించామని తెలిపారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా, గోప్యంగా తెలియజేసేందుకు ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల మొదటి తేదీన వాటిని తెరిచి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొంటూ ప్రతి కుటుంబం ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగించుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులు ఇంగ్లీష్ భాష నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఖాన్ అకాడమీ ద్వారా గణితం, సైన్స్‌లో పట్టు సాధించాలని కోరారు. ఈ ఏడాది జిల్లా నుంచి ట్రిబుల్ ఐటీ బాసరకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య రెండు అవసరమని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాల సంఖ్య పెరిగిందన్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి కలెక్టర్ శాయశక్తులా పనిచేస్తున్నారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ రూపొందించిన ఆరోగ్య పాఠశాల, విద్యా క్యాలెండర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో త్వరలో సీసీ రోడ్డు, బోర్వెల్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే కలెక్టర్ సహకారంతో కొత్తపల్లి గ్రామానికి సుమారు రూ. 1 కోటి వ్యయంతో వంతెన మంజూరు చేయించినట్లు చెప్పారు. జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో స్వచ్ఛమైన తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లా కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కలిసి పోక్సో చట్టం2012 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పోషకాహార తోటను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఎంఈఓ రాంకిషన్, అకడమిక్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవారంగ ప్రముఖులకు ఘన సన్మానం

మంచిర్యాల, జులై 2,ప్రభాతవార్త

లయన్స్ క్లబ్ గర్మిళ్ల మంచిర్యాల ఆధ్వర్యంలో నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన వైద్యుల దినోత్సవం, తపాలా ఉద్యోగుల దినోత్సవం, గణాంక లెక్కల నిపుణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ వైద్యులైన రేడియాలజీ నిపుణుడు సిరిపురం శ్రీనివాస్, నేత్ర వైద్య నిపుణుడు చిందం అభిషేక్, స్త్రీరోగ వైద్య నిపుణురాలు జ్యోతి తదితర ఎనిమిది మంది వైద్యులను సన్మానించి, వారు ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. అదేవిధంగా నలుగురు మహిళా తపాలా సిబ్బందిని, ఇద్దరు గణాంక లెక్కల నిపుణులను సత్కరించి వారి కృషిని అభినందించారు. సమాజ అభివృద్ధిలో వైద్యులు, తపాలా సిబ్బంది, లెక్కల నిపుణుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కాసం మల్లికార్జున్, ఖజాంచీ చిట్ట గిరిబాబు, జిల్లా నాయకులు సిరిపురం శ్రీనివాస్, మండల బాధ్యులు దొంతుల ముఖేష్, ప్రాంతీయ బాధ్యులు చక్రధర్, క్లబ్ సీనియర్ సభ్యులు రామచందర్, బల్లు శంకర్లింగం, గుండా సుధాకర్, సంపత్ కుమార్, కుంకుముట్టి వెంకటేశ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిర్పూర్ (టి), జూలై 2, ప్రభాతవార్త :

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భంగం కలిగించే ప్రభుత్వ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు గురువారం సిర్పూర్ (టి) తహసీల్దార్ రహీముద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికుల ప్రతినిధులు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు అమలులో ఉన్న సంక్షేమ పథకాలను బీమా కంపెనీలకు అప్పగించేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.12ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. అలాగే భవన నిర్మాణ కార్మికుడు సహజ మరణం చెందిన సందర్భంలో అతని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ రహీముద్దీన్, కార్మికుల డిమాండ్లను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, చింతల సత్యనారాయణ, రవి, రమేష్తో పాటు పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## అమెరికాలో ప్రమాదానికి గురైన నస్పూర్ విద్యార్థినికి.. అండగా నిలిచిన ఎమ్మెల్యే

### - పాస్‌పోర్ట్, వీసాతో పాటు రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందజేత

నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త



అమెరికాలో ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ పట్టణానికి చెందిన లగిశెట్టి స్పందన కుటుంబానికి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పెద్ద దిక్కుగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. లగిశెట్టి శ్రీనివాస్ కుమార్తె అయిన స్పందన ఉన్నత చదువుల కోసం అమెరికాలోని చికాగో నగరానికి వెళ్లింది. అయితే, ఇటీవల అక్కడి ఒక మెట్రో స్టేషన్‌లో స్పందన ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమె కోమాలోకి వెళ్లి ప్రస్తుతం అక్కడి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతోంది. కుమార్తె పరిస్థితి తెలిసి తీవ్ర ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులు తమకు అర్ధరాత్రి వేళ అమెరికా వెళ్లే మార్గం కనిపించక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును ఆశ్రయించారు. విషయం వినగానే చలించిపోయిన ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. అత్యవసరంగా స్పందన తల్లిదండ్రులు అమెరికా వెళ్లేందుకు వీలుగా సీఎంఓ ఉన్నతాధికారులతో స్వయంగా మాట్లాడి పాస్‌పోర్ట్, అత్యవసర వీసా మంజూరు చేయించారు. అంతేకాకుండా, వారి విమాన ప్రయాణ టికెట్లు, ఇతర అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ. 3,00,000 ఆర్థిక సాయాన్ని బాధిత తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ.. ఆ భగవంతుడి ఆశీస్సులతో స్పందన అతి త్వరగా కోలుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. విదేశాల్లో ఉన్నా మన బిడ్డకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం తరపున కూడా అన్ని విధాలా ప్రయత్నిస్తామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో స్పందించి తమను అమెరికా పంపించే ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యేకు స్పందన తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## 18, 32వ డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

### - నూతన గృహాలను ప్రారంభించిన మేయర్ ధర్ని మధుకర్

నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‚ఇందిరమ్మ ఇళ్లు„ పథకం కింద మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ, 32వ డివిజన్లలో నిర్మించుకున్న నూతన గృహాల ప్రారంభోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ నూతన గృహాలను ప్రారంభించారు. 18వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు చిలుకూరు కీర్తన సంతోష్ దంపతులు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇంటిని మేయర్ దర్ని మధుకర్, స్థానిక కార్పొరేటర్ రాచమళ్ళ కమల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ రాచమళ్ళ కమల శ్రీనివాస్, 17వ డివిజన్ కార్పొరేటర్ లగిశెట్టి రాజయ్య, వార్డు ఆఫీసర్ కుమార్, మంచిర్యాల జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఒడ్డె రాజమోళి, హాజీపూర్ మండల యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆడెపు రమేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారిశెట్టి సంతోష్, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

### 32వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

అలాగే మంచిర్యాల గౌరవ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సహకారంతో 32వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు మర్రి రాజమణి సత్యనారాయణ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని కూడా మేయర్ దర్ని మధుకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపతి తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పిట్టల రవి, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ రెండు కార్యక్రమాలలో మేయర్ ధర్ని మధుకర్ లబ్ధిదారులకు నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి విచ్చేసిన మేయర్, కార్పొరేటర్లను లబ్ధిదారులు మర్యాదపూర్వకంగా శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ రెండు డివిజన్లలో జరిగిన వేడుకలకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



# నిత్య యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

### - మంచిర్యాలకు ఆదర్శంగా ఓం అష్టోత్తర యోగా పీట్

### - పదేళ్లుగా నిరంతర ఉచిత యోగ శిక్షణ.. శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత అందించే మహత్తర సాధన

మంచిర్యాల, జూలై 2,ప్రభత్తవార్త



ఓం అష్టోత్తర యోగా పీట్ సభ్యులు

నిత్యం యోగం చేయండి.. ఆరోగ్యంగా జీవించండి అనే లక్ష్యంతో మంచిర్యాల నగరంలోని బాలుర పాఠశాల మైదానంలో ఓం అష్టోత్తర యోగ పీఠం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా నిత్య యోగ సాధన విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ అందిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యంత ఆదరణ పొందిన యోగ పీఠంగా గుర్తింపు పొందింది.గురూజీ గుండ విజయ్ కుమార్ ఆర్య మార్గదర్శకత్వంలో, యోగ పీఠం అధ్యక్షులు ముక్త వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కోడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ యోగ సాధన ఘనంగా కొనసాగుతోంది. వర్షాకాలం, చలికాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా ఒక్కరోజు కూడా విరామం లేకుండా క్రమశిక్షణతో యోగాభ్యాసం నిర్వహించడం ఈ పీఠం ప్రత్యేకత.ఎముకలు కొరికే చలిలోనైనా, కుండపోత వర్షంలోనైనా, మండే ఎండలోనైనా సుమారు 30 మంది సభ్యులు ప్రతిరోజూ యోగ సాధనలో పాల్గొంటూ పలువురి మన్ననలు పొందుతున్నారు. ప్రతి ఆదివారం యోగాభ్యాసం అనంతరం సభ్యులందరూ కలిసి అమృతాహారం స్వీకరిస్తూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకుంటున్నారు.

### నిర్దిష్ట దుస్తులు తప్పనిసరి..

ఒక రోజు హాజరు కాకపోయినా జరిమానా అనే నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ సభ్యుల్లో క్రమశిక్షణ, బాధ్యత, సమయపాలన పెంపొందిస్తున్నారు. ఈ నియమాల వల్ల ప్రతి సభ్యుడు యోగాన్ని తన నిత్య జీవితంలో భాగంగా మార్చుకున్నాడు. ఈ యోగ పీఠంలోని అనేక మంది సభ్యులు మధుమేహం, రక్తపోటు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, మెడ నొప్పి, ఊబకాయం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి వంటి దీర్ఘకాలిక సమస్యల నుంచి ఉపశమనం పొందినట్లు తెలిపారు. యోగం ద్వారా మందులపై ఆధారపడే పరిస్థితి తగ్గిందని వారు పేర్కొన్నారు. యోగం మన శరీరానికి మాత్రమే కాదు మనస్సుకూ ఔషధం. యోగాభ్యాసం వల్ల శరీరం దృఢంగా మారుతుంది. కండరాలు బలపడతాయి. వెన్నెముక సరిగా ఉంటుంది. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. శ్వాసకోశం బలపడుతుంది. జీర్ణక్రియ చక్కబడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. యోగం మానసిక ప్రశాంతతకు మూలం. ఆందోళన, భయం, కోపం, నిరాశ తగ్గుతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది. మనసులో సానుకూల ఆలోచనలు పెంపొందుతాయి. రోజువారీ జీవితంలో ఉత్సాహం, చురుకుదనం పెరుగుతుంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ యోగం ఎంతో ఉపయోగకరం. విద్యార్థులకు చదువులో ఏకాగ్రత పెరుగుతుంది. ఉద్యోగులకు ఒత్తిడి తగ్గుతుంది. మహిళలకు శారీరక దృఢత్వం లభిస్తుంది. వృద్ధులకు కీళ్ల చలనం మెరుగుపడుతుంది. ఈ యోగ పీఠం మరో ప్రత్యేకత సభ్యుల మధ్య ఏర్పడిన కుటుంబ బంధం. సభ్యులంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటూ ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ‚మేమున్నాం" అంటూ ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తున్నారు. అన్నదమ్ముల్లా పరస్పరం అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.ప్రస్తుత కాలంలో మారిన జీవనశైలి, ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడి కారణంగా అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో యోగాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడం అత్యవసరం. ప్రతిరోజూ కొద్దిసేపు యోగ సాధన చేస్తే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుంది. మంచిర్యాల నగరవాసులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓం అష్టోత్తర యోగ పీఠం నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణలో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆ ఆరోగ్యాన్ని కాపాడే సులభ మార్గం యోగమే అని వారు స్పష్టం చేశారు.



## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలి

హాజీపూర్, జూలై 02, ప్రభాతవార్త

అధిక సాంద్రత పద్ధతిలోనే పత్తి సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ అన్నారు.గురువారం రోజు మండలంలోని గుడిపేట రైతు వేదిక లో జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ పరిధిలోని పత్తి ఉత్పాదకత మిషన్ (కపాస్ కాంతి 2026) పథకం కింద హాజీపూర్ మండలంలో మూడు అంశాల ద్వారా క్లస్టర్ ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది.ఇందులో అధిక సాంద్రత పత్తి సాగు కింద 86 హెక్టర్లు, దగ్గర వరుసల మధ్య దూరంతో పత్తి సాగు (క్లోజర్ స్పేసింగ్) కింద 36 హెక్టర్లు, సమగ్ర పంట యాజమాన్యం కింద 11 హెక్టర్లలో అనగా మొత్తం 133 హెక్టార్లలో క్లస్టర్ ప్రదర్శనలు చేపడుతున్నారు.అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిలో సాధారణ సాగుతో పోలిస్తే ఎకరానికి ఎక్కువ మొక్కలు నాటడం వల్ల భూమి వినియోగం సమర్థవంతంగా జరిగి, ప్రారంభ దశలో కలుపు నియంత్రణమెరుగుపడటంతో పాటు అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. ఈ పద్ధతి తేలికపాటి ఎర్ర నేలలు మరియు దుబ్బ నేలలకు అనుకూలంగా ఉండి, పంట త్వరగా కోతకు వస్తుంది. దగ్గర వరుసల మధ్య దూరంతో పత్తి సాగు (క్లోజర్ స్పేసింగ్) ద్వారా మొక్కల సాంద్రత పెరిగి, సూర్యరశ్మి మరియు పోషకాల వినియోగం మెరుగుపడుతుంది. దీంతో ప్రారంభ దశలోనే మంచి పెరుగుదలతో పాటు అధిక దిగుబడి సాధించే అవకాశాలు పెరుగుతాయి. ఈ పథకం కింద ప్రభుత్వంచే రాయితీ పై అందజేసిన పత్తి విత్తనాల ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సింగతి మురళి, మంచిర్యాల ఏడిఏ మామిడి క్రిష్ణ, ఎఫ్‌పిఓ డైరెక్టర్ పుస్కూరి శ్రీనివాస రావు,స్థానిక కార్పొరేటర్ కమల శ్రీనివాస్ గౌడ్, ఏఓ హాజీపూర్ క్రిష్ణ, ఏఈ మోనిక తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు రక్షణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి: కొక్కిరాల సురేఖ

### - మంచిర్యాలలోని పలు డివిజన్లలో ఓటరు సవరణ ప్రక్రియ

నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా, అప్రమత్తంగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9, 10, 30, 31, 33, 34, 37 డివిజన్లలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు ఎస్ఐఆర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ)పై నిర్వహించిన ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి, వారికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఉండేందుకు బూత్ స్థాయి ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రజలు తమ ఇంటికి వచ్చే అధికారులకు పూర్తి వివరాలు అందించి ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్, స్థానిక కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డివిజన్లలో ఓటరు సవరణ సర్వేలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ, మేయర్ ధర్ని మధుకర్

# ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయి

- (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- కనీస వేతనాల జీవోను కార్మికులందరికీ వర్తింపజేయాలి
- ఆశ, అంగన్‌వాడీల సమస్యలపై నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశం




నస్పూర్, జులై 2, ప్రభాతవార్త

దేశంలో బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచకుండా నిత్యావసర సరుకులు, కూరగాయలు, పుస్తకాల ధరలు, ఆసుపత్రి ఖర్చులు పెంచుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అబ్బోజు రమణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, నేడు సుమారు రెండు లక్షల పరిశ్రమలను మూసివేసి కార్మికులను ఉపాధికి దూరం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పాలడుగు భాస్కర్ ఆరోపించారు. మహిళలకు కేవలం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే సరిపోదని, వారికి సరైన ఉపాధి చూపించి పనిచేసే మహిళా కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోను ప్రకటించినప్పటికీ, అది రాష్ట్రంలోని ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ వీఓఏ ఉద్యోగులు, హమాలీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్, మెడికల్ రిప్స్ లాంటి రంగాల కార్మికులకు వర్తించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వీరిని కార్మికులుగా గుర్తించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే ఆందోళనలను, పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**నూతన కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం సీఐటీయూ నూతన బాధ్యుల ఎన్నిక జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులుగా గోమాస ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శిగా దాగం రాజారాం, సింగరేణి కాంట్రాక్టు కోఆప్షన్ సభ్యులుగా, జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎండి రఫియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, రాష్ట్ర నాయకులు వెంకటస్వామి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు సాంబరి వెంకటస్వామి, కాసర్ల రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షురాలు సమ్మక్క, జిల్లా కమిటీ సభ్యులు స్వాతి, లక్ష్మణ్, దేవదాస్, రమేష్, లీలారాణి, అనుబంధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించిన ఆదర్శ విద్యార్థినులు

ఆసిఫాబాద్ టౌన్, జులై 2, ప్రభాతవార్త :



జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు సంజన సిరికొండ, సాయి, శివ మల్లిక నెట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ దుర్గ మహేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జూన్ 24, 25 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అనంతరం పాండిచ్చేరిలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు ఎం. మల్లేష్, ఎస్. వర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ బి. తిరుపతి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## రైతులకు ఉచిత పత్తి విత్తనాలు పంపిణీ

తాండూర్, జులై 2, ప్రభాతవార్త

మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో గురువారం కపాస్ క్రాంతి పథకం కింద ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పత్తి విత్తనాలను 30 మంది రైతులకు పంపిణీ చేశారు. సాంద్రత పద్ధతిలో పత్తి సాగు ను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం కపాస్ క్రాంతి పథకం ద్వారా రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ చేసిందని ఏ ఈ ఓ లు తెలిపారు. మండలంలో 219 హెక్టార్లలో అధిక సాంద్ర పద్ధతిలో పత్తి సాగు ను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రైతులకు వ్యవసాయ శాఖ సాగులో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు సాగు పద్ధతుల పై ఏఈఓ లు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్, ఏఈఓలు వెంకటేష్, రాకేష్, మోనిక, రైతులు, పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటేష్, ఏఈఓ లు



## బుయ్యారంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

వేమనపల్లి, జులై 2, ప్రభాతవార్త

వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో ఇందిరమ్మ గృహ పథకం కింద నిర్మించిన నూతన గృహాన్ని గురువారం లబ్ధిదారులు జెడ చిన్నమల్ల-భీమయ్య దంపతులకు అందజేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆర్. సంతోష్ కుమార్, గ్రామ సర్పంచ్ కొండి మానస కలిసి ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్. సంతోష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ గృహ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చొరవతో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, సర్పంచ్ పుప్పులపు సాయికృష్ణ, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని ఒకరి మృతి

తాండూర్, జులై 2, ప్రభాతవార్త :

మండలంలోని రేపల్లెవాడ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం వాహనం ఢీకొని కోట భూదేవి (70) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు తాండూర్ ఏ.ఎస్.ఐ రాజమొగిలి తెలిపారు.ఏ.ఎస్.ఐ. కథనం ప్రకారం... తన కుమారుడు శంకర్ ఇంటికి వెళ్లి భూదేవి రోడ్డు దాటుతుండగా రెబ్బెన నుండి బెల్లంపల్లి వైపుకు వస్తున్న వాహనం ఢీకొట్టింది. కాళ్లు, నడుము నుజ్జు నుజ్జు కావడంతో వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

## విద్యార్థినులకు షీ టీమ్ అవగాహన కార్యక్రమం

ఆసిఫాబాద్, జులై 2, ప్రభాతవార్త :

ఆసిఫాబాద్ పట్టణంలోని టిటిడబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థినులకు షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు గురువారం షీ టీమ్ సభ్యులు విద్యార్థినులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రేరణాత్మక తరగతులు నిర్వహించి విద్య, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యతను వివరించారు. అదేవిధంగా గుడ్, బ్యాడ్ టచ్ గురించి సమగ్రంగా వివరించి తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలను పోస్ట్ చేయరాదని, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలను విద్యార్థినులకు వివరించారు. సోషల్ మీడియా అధిక వినియోగం వల్ల మానసిక ఒత్తిడి పెరగడంతో పాటు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఏదైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే ఆసిఫాబాద్ షీ టీమ్ ఫోన్ నంబర్ 8712670564కు సమాచారం అందించాలని విద్యార్థినులను కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులతో పాటు టిటిడబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ అరుణ శ్రీ, సిబ్బంది స్వప్న, రజని తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

లింగాపూర్, జులై 2, ప్రభాతవార్త

లింగాపూర్ మండలంలోని జముల్లధరా గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాలైన మారుగూడా,సోలార్ గూడ, పూనా గూడ, కొల్లంగూడ, గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి గ్రామంలో అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సమావేశంలో మండల కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ, తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం టిజిఐఎల్పి అనేది, అత్యంత నిరుపేదలను గుర్తించి వారికి జీవనోపాది కల్పించి ఆర్థికంగా అభివృద్ధిపరిచి అక్షరాస్యత పెంచే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క సభ్యురాలు, గ్రామంలోని ప్రజలు పాల్గొని గ్రామంలో నిరుపేదలు లేకుండా కనీస జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని తెలిపార. ఈ సమావేశంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పటేల్, హారే కుమర షేకు, పచ్చకి మానుకు, జగ్గక మారుతి, సలాం హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న బ్లాక్ కోఆర్డినేటర్ రవికుమార్



## వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రి వద్ద ప్రత్యేక శుభ్రత చర్యలు

**వేమనపల్లి, జూలై 2, ప్రభాతవార్త**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వేమనపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో గురువారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ వుప్పులపు సాయికృష్ణ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఆసుపత్రి సమీపంలో పేరుకుపోయిన చెత్త, మురికి కాలువలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని శుభ్రత పనులు చేపట్టారు.

## కాసిపేట్-2 ఇంక్లైన్ గనిని సందర్శించిన జీఎం రాధాకృష్ణ

**మందమర్రి, జూలై 02, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట్–2 ఇంక్లైన్ గనిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గురువారం రోజున ప్రథమ షిఫ్ట్‌లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా అండర్‌గ్రౌండ్ (గని అంతర్భాగం)లోకి వెళ్లి, కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాలను మరియు అక్కడ అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో, సిబ్బందితో సమావేశమై నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో పాటు బొగ్గు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యాల సాధన ఎంత ముఖ్యమో, ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం కూడా అంతే ముఖ్యమైనది అని అన్నారు. ప్రమాద రహితంగా విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ, రక్షణ చర్యల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఉద్యోగులు, కార్మికులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గని సర్వేయర్ తిరుపతి, ఉన్నతాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీల్వాయి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

**వేమనపల్లి, జూలై 2, ప్రభాతవార్త**



జైపూర్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ. వెంకటేశ్వర్ గురువారం నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, ఆయుధాలు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఇన్‌స్పెక్షన్ అనంతరం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ అమానుల్లాఖాన్ వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని, శాఖకు అందించిన సేవలను అభినందిస్తూ పదవీ విరమణ జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి అర్హత ఓటరు తన ఓటు నమోదు చేసుకోవాలి

### - ఓటర్లకు అవగాహన కల్పించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు - దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచన

**మంచిర్యాల, జూలై 2, ప్రభాతవార్త**



అవగాహన సదస్సులో పాల్గొన్న బిజెపి నాయకులు

ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా గురువారం మంచిర్యాల కార్పొరేషన్ 46వ డివిజన్‌లోని 174వ పోలింగ్ కేంద్ర పరిధిలో ఆయన ప్రజలను కలిసి నమోదు దరఖాస్తు పత్రం నింపే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరికి సంబంధిత అధికారులు అందజేసిన నమోదు దరఖాస్తు పత్రాన్ని సరైన వివరాలతో నింపి సమర్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియ సక్రమంగా సాగేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ తరఫున ప్రత్యేక ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు, అభ్యంతరాలు ఉన్నా ఆయా ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. అర్హులైన ఓటర్ల ఓటు హక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబడదని ఆయన స్పష్టం చేశారు. కొందరు రాజకీయ నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. నమోదు దరఖాస్తు పత్రాన్ని సమర్పించిన ప్రతి అర్హ ఓటరికి ఓటు హక్కు కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీరిశెట్టి రాజ్‌కుమార్, ముచ్చకుర్తి కిషోర్, అవిడపు రాజబాబు, బింగి ప్రవీణ్, నల్ల రవి, అంకం మనోజ్, బండి శంకర్, కునారపు రమేష్, కంచర్ల శ్రీకాంత్, కలవెని సంపత్, అశోక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుడు కొత్తూర్ శంకర్‌ను ముందస్తు అరెస్ట్ చేస్తున్న భైంసా పోలీసులు

## తెలంగాణ ఉద్యమకారుడు కొత్తూర్ శంకర్ ముందస్తు అరెస్ట్

**భైంసా, జులై 02, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటివరకు తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వాలు గుర్తించడం లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టే ధర్నా కార్యక్రమానికి భైంసా పట్టణం నుండి వెళ్తున్న తెలంగాణ ఉద్యమకారుడు కొత్తూర్ శంకర్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చంచల్‌గూడ జైలుకు వెళ్లిన కొత్తూర్ శంకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వాలు వెంటనే గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్ల కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో ఉద్యమకారుల కుటుంబాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉద్యమకారుల న్యాయమైన హక్కుల కోసం చేసే పోరాటాలను అణచివేయడం సరికాదన్నారు.

## కపాస్ క్రాంతి పథకానికి రైతులకు ఆహ్వానం

**బజార్‌హత్నూర్, జులై 02, ప్రభాతవార్త:**

మండలంలోని పత్తి రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కపాస్ క్రాంతి అనే నూతన పథకానికి శ్రీకారం చుట్టాయని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద పత్తి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపే రైతులకు రాయితీ రూపంలో విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా రైతులు అధిక సాంద్రత, క్లోజర్ స్పేసింగ్ (దగ్గర దగ్గరగా విత్తే) పద్ధతిలో పత్తి పంటను సాగు చేయాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారి వివరించారు. ఈ నూతన సాగు విధానంపై ఆసక్తి గల మండల పరిధిలోని రైతులు వెంటనే తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సబ్సిడీ విత్తనాల అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రతి అర్హుడి ఓటు నమోదు కావాలి

### - బారెగూడలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన సర్పంచ్ కోట వేణుగోపాల్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 2, ప్రభాతవార్త :**

ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు వివరాలు తప్పనిసరిగా నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బారెగూడ గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ సూచించారు. బారెగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, నమోదు, పరిశీలన తదితర ప్రక్రియలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ ప్రజలు కార్యాలయానికి వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాల్సిన వారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, సజావుగా జరిగేలా గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ కోట వేణుగోపాల్ తెలిపారు.



# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ శిబిరాలు

### - ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి : భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకెత్ కుమార్ పిలుపు

**భైంసా, జులై 02, ప్రభాతవార్త:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం 2026లో భాగంగా భైంసా పట్టణంలో శుక్రవారం ఉదయం 07:00 గంటల నుండి ప్రత్యేక ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ శిబిరాలు నిర్వహించనున్నట్లు భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకెత్ కుమార్ తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను స్వీకరించాలని కోరారు. అలాగే ఫారాలలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి ఎన్నికల సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

**ప్రత్యేక శిబిరాలు నిర్వహించే కేంద్రాల వివరాలు**

సిద్ధిక్ ఫంక్షన్ హాల్, మార్కెట్ ఏరియా, భైంసా (ఇండియన్ గ్యాస్ సమీపంలో):ఈ కేంద్రంలో మొత్తం 23 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేస్తారు. పోలింగ్ స్టేషన్ నంబర్లు: 117, 118, 119, 120, 121, 122, 123, 124, 125, 126, 127, 128, 129, 139, 140, 141, 142, 143, 144, 145, 146, 147, 148.

**మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ (పాతది), బత్తి గల్లి, భైంసా**

ఈ కేంద్రంలో మొత్తం 19 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఫారాలను పంపిణీ చేస్తారు. పోలింగ్ స్టేషన్ నంబర్లు 114, 115, 116, 130, 131, 132, 135, 136, 137, 138, 149, 150, 151, 152, 153, 154, 155, 156, 157. ఈ శిబిరాలకు సంబంధిత పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు తప్పనిసరిగా హాజరై ఎన్యుమరేషన్ ఫారాలను పొందాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలని భైంసా సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# బీసీ హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

### - బీసీ ప్రకటన అమలులో విఫలమైన ప్రభుత్వాన్ని శాసనసభలో నిలదీయాలని హరీష్ రావుకు వినతి

**మంచిర్యాల జులై2 ప్రభాతవార్త**

బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బిఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావును జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి కోరింది. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో బీసీల సంక్షేమానికి సంబంధించి అనేక కీలక అంశాలను ప్రకటించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తరువాత వాటి అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మొదటి శాసనసభ సమావేశంలోనే మహాత్మ జ్యోతిబా పూలే పేరుతో బీసీ ఉప ప్రణాళికను చట్టబద్ధంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి వాటిని ఎ,బీ,సీ,డీ వర్గాలుగా విభజిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదన్నారు. అలాగే ప్రభుత్వ నిర్మాణ, నిర్వహణ ఒప్పందాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పినా ఆ హామీ నిలబెట్టుకోలేదని తెలిపారు. బీసీ కార్పొరేషన్ సమాఖ్యల కింద నమోదైన ప్రతి సంఘానికి ఎన్నికలు నిర్వహించి, పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని, బీసీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఎలాంటి పూచీకత్తు లేకుండా పది లక్షల రూపాయల రుణాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెడతామని, ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి లక్ష కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రకటనలో పేర్కొన్న హామీలన్నింటిని అమలు చేసేలా బిఆర్ఎస్ పార్టీ ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి మనోహర్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం, నాయకులు కంపరి వేణుగోపాల్, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీష్ రావుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో అప్రమత్తంగా ఉండాలి

### - ఓటరు జాబితా సవరణ పనులు, ఆరోగ్య కేంద్రం, కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**వేమనపల్లి, జూలై 2, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్లక్ష్యం లేకుండా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులకు సూచించారు. గురువారం వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి, వేమనపల్లి, నీల్వాయి గ్రామాల్లో జరుగుతున్న సవరణ ప్రక్రియను పరిశీలించి, 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు మరణించిన, గ్రామం విడిచి వెళ్లిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓ యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం నీల్వాయి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన, సమయానికి కేంద్రం తెరవకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, వంటశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయి కృష్ణ, ఆర్ఐ ఖలీక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి మయూరి, సర్పంచులు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయి కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### ఆర్ఓఎఫ్ఆర్ భూముల హద్దులు దాటొద్దు..

## అటవీ సంరక్షణకు సహకరించండి

### - కల్లంపల్లిలో అటవీ శాఖ క్షేత్రస్థాయి తనిఖీలు..రైతులకు నిబంధనలపై అవగాహన

**వేమనపల్లి, జూలై 2, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం కల్లంపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో ఆర్ఓఎఫ్ఆర్ (అటవీ హక్కుల చట్టం) కింద మంజూరైన భూములను గురువారం అటవీశాఖ బెల్లంపల్లి ఫారెస్ట్ డివిజన్ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన హద్దుల్లోనే సాగు చేస్తున్నారా అనే అంశాన్ని అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు పోల్స్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. చట్టం ప్రకారం ట్రాక్టర్లు వంటి ఆధునిక యంత్రాలను వినియోగించకుండా, సంప్రదాయ ఎడ్ల నాగళ్లతోనే సాగు చేయాలని అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలిగించే ఉచ్చులు, కరెంట్ తీగలు ఏర్పాటు చేయడం, వేట, స్మగ్లింగ్, పోడు భూముల కోసం అడవులను నరికివేయడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో కృష్ణపల్లి అటవీ క్షేత్ర అధికారి దయాకర్, వేమనపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి రూపేష్, ఒడ్డుగూడెం సెక్షన్ అధికారి స్వామి, బీట్ అధికారులు వెంకటేష్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ప్రతిరోజు చేపట్టాలి

**హాజీపూర్, జూలై 02, ప్రభాతవార్త**



గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ప్రతిరోజు చేపట్టాలని డీపీవో వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం రోజు జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వరరావు మండలంలోని రాపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించి ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని రహదారులు మరియు మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ పంచాయతీ కార్యదర్శి కి సూచించడం జరిగింది. వర్షాకాలం దృష్ట్యా గ్రామంలో ఎక్కడ కూడా నీరు నిల్వ లేకుండా చూడాలని నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ తయారు చేసి వేయాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రామ పంచాయతీలో తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ చేపట్టాలని సూచించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలని సూచించారు.గ్రామపంచాయతీ రిజిస్టర్లు మరియు రికార్డులు పరిశీలించి అన్ని రిజిస్టర్లు అప్డేట్ చేసి ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిపిఓ వెంట మండల పంచాయతీ అధికారి సుమన్,సర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్ జూలై 4కి మార్పు

### - మిగిలిన 84 సీట్ల భర్తీకి కౌన్సెలింగ్.. వెల్లడించిన ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్

**నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ లోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కోటా కింద మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్ తేదీని ముందుకు మార్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ (ఏజీఎం) కూర్మ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారుల ఆదేశాల ప్రకారం జూలై 8 లోపే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున, గతంలో జూలై 8న జరగాల్సిన కౌన్సెలింగ్‌ను ప్రభుత్వ సూచనల మేరకు జూలై 4న (శనివారం) నిర్వహించనున్నారు. జూన్ 11న జరిగిన మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం కాలేజీలోని 5 బ్రాంచ్‌లలో మొత్తం 84 సీట్లు మిగిలిపోయాయి. వీటిలో సివిల్ ఇంజినీరింగ్‌లో 22, కంప్యూటర్ ఇంజినీరింగ్ 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ 07, మెకానికల్ ఇంజినీరింగ్ 21, మైనింగ్ ఇంజినీరింగ్‌లో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయి. జూన్ 18 నుండి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ గడువు జూలై 2తో (నేటితో) ముగియనుంది. అర్హులైన అభ్యర్థులు జూలై 4న జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు 4 సెట్ల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆన్‌లైన్ అప్లికేషన్ కాపీపై సంబంధిత మైన్/విభాగపు అధికారి సంతకం, ఆఫీస్ స్టాంప్‌తో పాటు సుమారు రూ. 20,000 నగదుతో నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. ఈ కౌన్సెలింగ్‌లో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, అప్పటికీ సీట్లు మిగిలితే ఇతరులకు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

## అధికారుల పీఆర్‌పీ ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలి: బి. జనక్ ప్రసాద్

### - శ్రీరాంపూర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి ఐఎన్టీయూసీ పూర్తి మద్దతు ప్రకటన

**నస్పూర్, జూలై 2, ప్రభాతవార్త**

సింగరేణి అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున, వారికి రావాల్సిన న్యాయమైన పీఆర్‌పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులకు సంబంధించిన పీఆర్‌పీ నిలుపుదలను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అధికారుల పీఆర్‌పీ నిలుపుదల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు బి. జనక్ ప్రసాద్ వెల్లడించారు. అధికారులకు పీఆర్‌పీ చెల్లించేందుకు ఎలాంటి సాంకేతిక, పరిపాలన పరమైన ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. లాభాల సాధనలో నిరంతరం శ్రమిస్తున్న అధికారుల హక్కులను కాలరాయడం సరికాదన్నారు. యాజమాన్యం తక్షణమే స్పందించి నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, సెంట్రల్ నాయకులు కలవేన శ్యామ్, రిక్కల గోపాల్ రెడ్డి, ఎంబడి తిరుపతి, మహేందర్ రెడ్డి, చందు, మోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లోని సీఎంఓఏఐ నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బి. జనక్ ప్రసాద్



## చిరకాల వాంఛను నెరవేర్చిన కలెక్టర్, ఎమ్మెల్యేకు గ్రామస్తుల ఘన స్వాగతం

### - నియోజకవర్గాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం

**బజార్‌హత్నూర్, జులై 02, ప్రభాతవార్త:**

మండలంలోని గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల మారుమూల ప్రాంతం కొత్తపల్లి గ్రామస్థుల చిరకాల వాంఛగా ఉన్న వంతెన సమస్యను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తీర్చారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రూ. 1.50 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న వారికి గ్రామస్థులు డప్పు చప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లవుతున్నా, తమ గ్రామానికి మాత్రం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషి ఫలితంగా ఇప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చిందని గ్రామస్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఎందరో ఎమ్మెల్యేలు మారినా తీరని కొత్తపల్లి గ్రామస్థుల కష్టాలను ఇప్పుడు తీర్చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులను చేపట్టడం, ప్రజల కష్టాలను తీర్చడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా గ్రామస్థులతో ముచ్చటించి, గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణం పూర్తయిన వెంటనే గ్రామానికి రోడ్డు సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రియాంక భీమేష్, ఉప సర్పంచ్ గొల్లెన రాజేందర్, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత పత్తి విత్తనాల పంపిణీ

**బెల్లంపల్లి, జూలై 02, ప్రభాతవార్త**

జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం)లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందించే కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లాలో వానకాలం 2026 నుండి ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున సుమారు 30 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండున్నర ఎకరాలకు సరిపడే ఉచిత పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి సహకార సంఘం చైర్మన్ సిద్ధ స్వామి పాల్గొని, ఏడిఏ రాజా నరేందర్‌తో కలిసి రైతులకు విత్తన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏడిఏ రాజా నరేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎఫ్ఎస్ఎం కింద పలు పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా అధిక సాంద్రత పత్తి సాగు విధానాన్ని రైతులు అనుసరించాలని సూచించారు. బెల్లంపల్లి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఈ నూతన పద్ధతులను పాటిస్తే తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని చెప్పారు. సహకార సంఘం చైర్మన్ సిద్ధ స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత విధానంతో ఉచితంగా విత్తనాలు అందించడం అభినందనీయమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి కన్నాల సర్పంచ్ నేతరి మల్లమ్మ అధ్యక్షత వహించారు. అనంతరం అంకుశం, చంద్రవెల్లి, పెరికపల్లి సర్పంచులు కూడా రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ తిరుపతి, గురజాల ఏఈఓ గౌసియా బేగం తదితరులు, పలువురు రైతులు పాల్గొన్నారు.




# సమకాలీన సమాజంతో అనుసంధానం చేసుకోవాలి

### - కలెక్టర్ భవేశ్ మిశ్రా - కస్తూర్బా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**నిర్మల్, జూలై 02, ప్రభాతవార్త**



విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, తాము నేర్చుకున్న విజ్ఞానాన్ని సమాజంలోని పరిణామాలతో అనుసంధానం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. గురువారం సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. అనంతరం వంటశాల, సరుకుల నిల్వ గది, భోజనశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, ఆహార పదార్థాలనే వినియోగించాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మెస్ కమిటీ సభ్యులను ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్, వారి జవాబు పత్రాలను పరిశీలించారు. గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి, బోర్డుపై లెక్కలు చేయించారు. శాస్త్రవేత్తల కృషి, విజ్ఞాన శాస్త్రం సమాజ అభివృద్ధిలో పోషిస్తున్న పాత్రను విద్యార్థులకు వివరించారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. సృజనాత్మకత, సమస్యా పరిష్కార నైపుణ్యాలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్య, వసతి, భోజన సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ప్రత్యేక అధికారి సుధాకర్, తహసీల్దార్ సంతోష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జెవిలి పాఠశాలను సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

**సారంగాపూర్, జులై 02, ప్రభాతవార్త:**

మండలంలోని జెవిలి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాకేష్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా పిల్లలతో ముచ్చటించి విద్యాబోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వయంగా విద్యార్థులకు పాఠాలు బోధించి, వారి నుంచి సమాధానాలను రాబట్టారు. పాఠశాలలో విద్యార్థులు చాలా బాగా చదువుకుంటున్నారని అభినందించారు. ఆయన వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీకాంత్, మండల విద్యాధికారి మహేందర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేష్, ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## దిశ కమిటీకి పక్కా నివేదికలు సిద్ధం చేయాలిఆయిల్ పామ్ సాగు లక్ష్యం దాటాలి

### - కలెక్టర్ భవేశ్ మిశ్రాకలెక్టరేట్‌లో వరుస సమీక్ష సమావేశాలు

**నిర్మల్, జూలై 02, ప్రభాతవార్త:**




రేపు జరగనున్న దిశ కమిటీ సమావేశానికి అన్ని శాఖల నివేదికలు పక్కాగా సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశ కమిటీ నిర్వహణపై, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై ఆయన వరుసగా రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. దిశ కమిటీ సమావేశానికి ప్రజాప్రతినిధులందరికీ సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రతి శాఖ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలతో పారదర్శక నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పురోగతిని ఆయన సమీక్షించారు. అనంతరం జరిగిన ఆయిల్ పామ్ సమీక్షలో, జిల్లాకు నిర్దేశించిన 1600 ఎకరాల లక్ష్యానికి మించి సాగు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ వల్ల పెట్టుబడి, శ్రమ, సాగునీరు, రాబడిలో కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించి ప్రోత్సహించాలన్నారు. హార్టికల్చర్, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి మండలాల వారీగా లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ఎంతో ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఆర్డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అంజిప్రసాద్, రమణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొలాల్లో అక్రమ కరెంట్ తీగలు పెడితే కఠిన చర్యలు

### - రైతులకు మందమర్రి పోలీసుల హెచ్చరిక

**మందమర్రి, జూలై02, ప్రభాతవార్త**



పంటలను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు వ్యవసాయ పొలాల చుట్టూ అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమే కాకుండా మానవ ప్రాణాలకు తీవ్ర ప్రమాదకరమని మందమర్రి పోలీసులు హెచ్చరించారు. ఇటీవల కొంతమంది రైతులు కోతులు, అడవి పందులు, నీలిగాళ్లు తదితర అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో నేరుగా విద్యుత్ లైన్ల నుంచి అక్రమంగా కరెంట్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో, ఇలాంటి అక్రమ విద్యుత్ తీగలను పొరపాటున తాకిన అమాయక ప్రజలు, పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు, రైతులు విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంటలను రక్షించుకోవాలనే ఉద్దేశంతో చేపట్టే ఈ చర్యలు చివరకు విషాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

**బజార్‌హత్నూర్, జులై 02, ప్రభాతవార్త:**

మండలంలోని కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం 2026 రైతు భరోసా కింద ఆదిలాబాద్ జిల్లాలో 87,419 మంది రైతుల ఖాతాల్లో రూ. 95.64 కోట్లు జమ కావడం రైతులకు పెద్ద ఊరటనిచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వాల అప్పుల భారాన్ని ఎదుర్కొంటూనే రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇప్పటికే రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి, ఇప్పుడు పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. అంతేకాకుండా యాసంగి పంట కొనుగోళ్లను సమర్థంగా నిర్వహించి, మొక్కజొన్న, జొన్న పంటల డబ్బులను కూడా విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం విఠల్, నాయకులు పాండురంగ్, చిలుకూరి భూమయ్య, బత్తిని కిషన్, ఈర్ల శివుడు, రమణ, స్వామి, రవి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.





## లయన్స్ క్లబ్ ఆఫ్ కాగజ్‌నగర్ కొత్తపేట ఆధ్వర్యంలో వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లకు ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 2, ప్రభాతవార్త :**

సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతలో చార్టర్డ్ అకౌంటెంట్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని లయన్స్ క్లబ్ ఆఫ్ కాగజ్‌నగర్ కొత్తపేట ప్రతినిధులు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో బుధవారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ కాగజ్‌నగర్ కొత్తపేట ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖ వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా. కొత్తపల్లి అనిత, ప్రధాన కార్యదర్శి లయన్ సాయి కిరణ్ గౌడ్, కోశాధికారి లయన్ రతన్ గైన్ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యులు, దేశ ఆర్థికాభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి సత్కరించడం లయన్స్ క్లబ్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డా. శ్రవణ్ కుమార్, డా. కృష్ణారావు, డా. రమాకాంత్, డా. సునీత, డా. జ్యోతి, డా. విద్యాసాగర్, డా. సుదీప్, డా. స్రవంతి, డా. సాగర్, లయన్ డా. తిరుమలేష్, లయన్ పోతురాజుల లక్ష్మణ్, లయన్ అరుణ్ లోయ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. లకావత్ వెంకట్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్యులు డా. కిరణ్ కుమార్, డా. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుద్ధ్యం.. మరుగుదొడ్లు లేక విద్యార్థినుల అవస్థలు

**భైంసా, జులై 02, ప్రభాతవార్త:**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు, బాలురకు తగిన మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకొని కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని ఛాత్ర యువ సంఘర్ష సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 30న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం ప్రకారం, నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 250 మంది విద్యార్థినులకు కేవలం ఒకే ఒక్క బాత్రూమ్ మాత్రమే ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. బాత్రూమ్‌లలో తలుపులు లేకపోవడం వల్ల విద్యార్థినులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడం అత్యంత బాధాకరమన్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు శిథిలావస్థలో ఉండటం, నీటి సౌకర్యం, పరిశుభ్రత లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు అత్యంత అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను కల్పించడంలో విఫలమైందని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని, బాలికలు, బాలురకు వేర్వేరుగా తగిన సంఖ్యలో మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పాడైన మరుగుదొడ్లను అత్యవసరంగా మరమ్మతులు చేయడంతో పాటు ప్రతి పాఠశాలలో నీరు, పరిశుభ్రత, శానిటేషన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఛాత్ర యువ సంఘర్ష సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



# జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

**– విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయకుంటే సమరశీల పోరాటాలు**

**– బంద్‌కు తెలంగాణ సమాజం సహకరించాలి – వామపక్ష విద్యార్థి సంఘాలు**

**బెల్లంపల్లి, జూలై 02, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వామపక్ష విద్యార్థి సంఘాలు (ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, ఏఐఎఫ్డిఎస్, ఏఐఎస్బి) రాష్ట్ర కమిటీలు విమర్శించాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి అనేక సమస్యలు పేరుకుపోయినా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించాయి.




ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న కేజీ నుంచి పిజి వరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజలు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లాల శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు డికొండ జతిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఎఐఎఫ్‌డీఎస్ జిల్లా ఇంచార్జ్ పసులేటి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, విద్యార్థుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగనున్న ఈ బంద్‌ను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు.

### వారు ఉంచిన ప్రధాన డిమాండ్లు:

ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అన్ని విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలి. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి. మహిళా విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకొని ప్రతి విద్యాసంస్థలో ఐసీసీ కమిటీలు ఏర్పాటు చేయాలి. విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి. జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి2020) అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అయినప్పటికీ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం, విద్యార్థుల హక్కులను సాధించుకోవడం కోసం జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

## కుల బహిష్కరణ వేధింపులు..

**- రక్షణ కల్పించాలని దంపతుల వేడుకోలు**

**బెల్లంపల్లి, జూలై 02, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన దంపతులు తమపై కొనసాగుతున్న కుల బహిష్కరణ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్ణగొల్ల సామాజిక వర్గానికి చెందిన పోలవేణి పవన్, ఆయన భార్య మంజుల తమ గోడును వ్యక్తం చేశారు. తమను కుల పెద్దలు అకారణంగా ఏడాదికి పైగా కుల బహిష్కరణకు గురి చేసి, రూ.5,000 జరిమానా విధించి నిరంతరం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కర్ణగొల్ల యాదవ సంఘానికి చెందిన పోలవేణి రాజం, కొమ్ము బీరయ్య, పోలవేణి మొండి తమ కుటుంబాన్ని ఏడాదిన్నర క్రితం బహిష్కరించి జరిమానా వసూలు చేశారని తెలిపారు. తమ తల్లిదండ్రులు పోలవేణి రాగులయ్య, భూమక్కల ఆస్తి పంపకాలలో భాగంగా తనకు 4.5 గుంటల భూమి వచ్చిందని, అదే ప్రాంతంలో నివసిస్తున్న తమ్ముడు రాజుకు ఇంటి త్రోవ కోసం 12 అడుగుల స్థలం ఇవ్వాలని కుల పెద్దలు నిర్ణయించగా తాము అంగీకరించామని చెప్పారు. అయితే అదనంగా మరో 1.5 అడుగుల స్థలం ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ కుల పెద్దలు, తమ్ముడు కుమ్మక్కై మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాది నుండి తమ కుటుంబాన్ని సామాజికంగా దూరం పెడుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇటీవల జరిగిన పస్కా పిల్ల వేడుకకు కూడా ఆహ్వానించలేదని తెలిపారు. దీనిపై ప్రశ్నించగా పోలవేణి రాజం ఫోన్‌లో దుర్భాషలాడినట్లు ఆరోపించారు. అలాగే పోలవేణి రాజు తనపై సబ్బలి పట్టుకుని దాడికి యత్నించి, భూమి ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. కుల పెద్దల కక్ష సాధింపు చర్యల వల్ల తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేసిన దంపతులు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరారు.

## సీజనల్ వ్యాధులు, డ్రగ్స్‌పై జిల్లా కళాకారుల అవగాహన కార్యక్రమం

**సారంగాపూర్, జులై 02, ప్రభాతవార్త:**

మండలంలోని తాంద్ర.జి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఓటు హక్కు, సీజనల్ వ్యాధులు, డ్రగ్స్ మరియు బాల్యవివాహాల చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కళాకారులు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో పాటలు పాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని కళాకారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కును భద్రంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, అలాగే 18 ఏళ్లు నిండకుండా చేసే బాల్య వివాహాల చట్టాలపై తమ ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నిరటి రఘు చరణ్, గ్రామ కారోబార్ లక్ష్మణ్, మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్, మాజీ సర్పంచ్ సూర్యం, నాయకులు కొడిమెల మచ్చందర్, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

